'ఛా! మీరెప్పుడూ ఇంతే!' అంటూ తన బుగ్గమీద సన్నగా చిటిక వేస్తుంది తన కమల.

కమల కోరిన రీతిగానే తన కొక చిన్నకుర్రవాడు పుట్టేవాడు. తన తండ్రిపేరు పెట్టేవాడు తన చిట్టి తండ్రికి. ఎన్నోరకాల బొమ్మలు తెచ్చేవాడు తన పాపకోసం.

సాయంకాలంపూట చిట్టడుగులు వేస్తూన్న తన బింబంతో పాటు వీధికి షికారు పోయేవాడు. తప్పడుగులు వేస్తున్న తన పాపను చూచి భార్యా తనూ కులాసాగా మాట్లాడుకునే వాళ్ళు.

చీకటి పడుతుందనగా తను పిల్లవాడిని ఎత్తుకొని కారులో ముందుసీటులో కూర్చుండేవాడు. తన భార్య స్టీరింగు త్రిప్పేది, తన చేతులలోని పిల్లవాడు ఆత్రంగా ఆ స్టీరింగు త్రిప్పుతున్న తల్లి చేతులమీదికి దూకుతూఉంటే తను పట్టుకుని ఆపేవాడు.

ఇంతలో తన గేటుదగ్గర ఆగుతుంది కారు. తన చేతులలోనుండి పిల్లవాడిని తీసుకుంటూ తలుపు తెరిచి ఇంట్లోకి పోతుంది కమల, వెను వెంటే తనుకూడ పోతాడు మెల్లగా బూట్లతో చప్పుడు చేసుకొంటూ.

తనభార్య పిల్లవాడికి అన్నంపెట్టి నిద్రపుచ్చుతుంది. తను నాలుగువందల కేండిల్ బల్బు వెలుతురులో పెద్దపెద్ద పుస్తకాలు తిరగవేస్తుంటాడు. ఆ సమయంలో కమల వస్తుంది. భోజనంచేసి ఇద్దరూ కుర్చీలలో కూర్చుంటారు.

రాత్రి చాలా ప్రొద్దుబోతుంది, భార్య నిద్రబోదామని బలవంతంచేస్తుంది. కాని తెల్లవారితే ఎన్నిపనులు చేయాలో గుర్తుకురాగానే తన మనసు కలవరపడుతుంది. 'పోనీ, నువ్వు పడుకో' అంటాడు తను భార్యవంక చూస్తూ.

భార్య నిర్లక్ష్యంగా ప్లాస్కులో కాఫీ గ్లాసులో పోసి అందిస్తూ కునికిపాట్లు పడుతుంది. తను గ్లాసు చేతితో పట్టుకోకుండానే నోరుజాపి గ్లాసులో కాఫీ తాగుతుంటాడు. ఆ నిద్ర మత్తులో తన భార్య గ్లాసుజారవిడుస్తుంది. గ్లాసు క్రిందపడుతుంది.

* * *

కాఫీ కప్పు చేసిన ధ్వని శర్మకు వినిపించింది.

'బిల్' అంటున్నాడా కాలేజీ విద్యార్థి. త్వరత్వరగా కుర్చీలోనుంచి లేచి, చెవులో ఇరికించుకొన్న పెన్సిలుతో జేబులో ఉన్న బిల్ పుస్తకంమీద రెండణాల బిల్ రాసి చింపి ఇచ్చాడు శర్మ.

"ప్రేమమయము మీ జీవనము
త్యాగమయము మీ జగమూ!"

# స్వామి భక్తిలోని సౌందర్యం

కాంతం

రంగనాయకులు తెలివిగలవాడు. ఎటువంటి పాతసరుకైనా అతని చేతిలో పడ్డతర్వాత చాలా మంచిదవుతుంది. బేరానికి వొచ్చినవాళ్లు భ్రమించేటట్టు చెయ్యటంలో అతనికతనే సాటి. ఎంతటి అసాధ్యుడు కాకపోతే వెంకట్రత్నం దగ్గిర ఏడాదినుంచీ పని చేస్తున్నాడంటారూ?

వెంకట్రత్నానికి అట్టే బుర్రలేదు. అయితే ఊళ్లోపాన్ని కప్పిపుచ్చగల డబ్బు అతని దగ్గిర పుష్కలంగా వుంది. బుర్రలేకపోతేనేం! తన దగ్గిరవున్న డబ్బుతో బుర్రగలిగినవాళ్ళను డజన్ల కొద్దీ కొనగలడు. అమోఘమైన తెలివితేటలు గల అనేకమంది వ్యక్తులు వెంకట్రత్నం దగ్గిర పాతికకీ, పరకకీ నానాచాకిరీ చేస్తున్నారు. స్వయంగా అతనికి బుర్ర లేకపోతేనేం? ఏం ముంచుకుపోతుంది?

వెంకట్రత్నం కొంతకాలంపాటు సవ్యంగానే వ్యాపారం చేశాడు. లాభాలు రెండుచేతులా పుచ్చేసుకొంటూనే వున్నాడు. అయినా ఆయనగారి దాహానికి ఉపశాంతి కాలేదు. నాలుగు చేతులతోటీ, వీలయితే వెయ్యి

చేతులతోటయినా సరే, అతనికి లాభాలు అందుకోవాలనిపించింది. అప్పటికి గాని తన మనస్సు శాంతి పడదని వెంకట్రత్నానికి అనిపించింది. అనిపించటంవల్ల ప్రమాదం లేదు గనుక అనిపించింది గాని, అప్పటికైనా 'తృప్తి' వొస్తుందని గట్టిగా చెప్పటానికి వీల్లేదు. ఎందుకంటే, ఉన్నది చాలక కొత్తదానికోసం అర్రులు చాచే వాడు, ఆ కొత్తది లభించిన తరవాత, మరో కొత్తకోసం ప్రయత్నించకుండా వుండగలగటం సాధ్యపడదు.

వెంకట్రత్నానికి లాభాలు రావాలనే వుంది. దానికోసం వ్యాపారం వృద్ధి చెయ్యాలనికూడా తెలుసు. అయితే ఎంత అభివృద్ధికి తెచ్చినా 'దాని' వల్ల వొచ్చినన్ని లాభాలు రావు — ఏముందీ, దొంగతనంగా కొనేసీ, ఎక్కువ రేటులో, చీకట్లో అమ్మేసేనీ! ఎంతకాలం న్యాయంగా అఘోరిస్తే అంతలాభం వొస్తుందీ!

రంగనాయకులు తెలివితేటలు గ్రహించిన వాడు గనక వెంకట్రత్నం ఈ పనికి అతన్నే వినియోగించాడు. మొదట్లో రంగనాయకులు భయపడ్డాడు. అతనికి యిటువంటి పనులంటే అసహ్యం కాదు గానీ, మహాభయం - ఇట్లా దొంగ వ్యాపారం చెయ్యటంలో అతనికి బొత్తిగా అనుభవం లేదు.

'నాకేం తెలియదండీ!' అన్నాడు రంగనాయకులు.

'ఇందులో తెలిసేదేముందీ? ఇదేమన్నా వైకుంఠపాళీ పరమా ఏమిటి తెలియకపోవటానికి? అవూళ్ళోకెళ్ళి వడ్లు కొనటం—రాత్రి పూట ఇక్కడకు తోలుకురావటం—మన లారీ వొస్తుంది- నువ్వేమీ చెయ్యక్కర్లేదు- వూరికే తోడుగా లారీతో వుండటమే!' అన్నాడు వెంకట్రత్నంగారు.

'ఏమో నాకు భయంగా వుంది' అన్నాడు రంగనాయకులు. పాపం! అతను నిజంగా వొట్టి భయస్తుడు.

'పిరికివాళ్ళను మేపటం నావల్లకాదు' అన్నాడు వెంకట్రత్నం. ఈమాట ఎంత ఘాటుగా పనిచేస్తుందో అతనికి తెలుసు. ప్రాణాలు పోగొట్టుకోవటానికైనా ఒప్పుకోనివ్వటం జరుగుతుందిగానీ, దొరికిన ఉద్యోగం వొదులుకోవటం జరగదు. ఈ విషయం వెంకట్రత్నానికి తెలుసు. అందుకే తరుచుగా అతనా ఆయుధాన్ని వాడుతుంటాడు.

ఈ వుద్యోగంపోతే తన గతేమిటో రంగనాయకులకుకూడా తెలుసు. డబ్బులేని జీవితం ఎట్లా వుంటుందో అతను మూడేళ్లు అనుభవించాడు. నిజంగా దరిద్రంకంటే నరకమనేది వేరే వున్నదనుకోవటం తెలివితక్కువ.

రంగనాయకులు వొప్పుకున్నాడు. ఆ వూరు వెళ్లాడు. సరుకు కొన్నాడు. లారీ కెత్తించాడు. తిరుగుముఖం పట్టాడు. ఇంతవరకూ ఏవిధమైన ఆటంకమూ జరగని మాట నిజం. కాని రంగనాయకులు దురదృష్టవంతుడు. అతని విధి ఎదురు తిరిగింది. చీకట్లోకి వెలుతురు కంపి, తోలుకుంటూ వొస్తున్న లారీ ఆగవలసి వచ్చింది. రోడ్డు పక్కనవున్న పోలీసులు లారీ ఆపారు. రంగనాయకులు నిలువునా కుంగిపోయ్యాడు. అతని గుండె మోకాళ్ళలోనికి దిగజారింది.

'ఎవరు?' అన్నారు పోలీసులు.

రంగనాయకులు నిజం చెప్పాడు. పాపం! అతనికి భార్యా బిడ్డలూ జ్ఞప్తికొచ్చి బావురుమన్నాడు.

'మిగతా విషయాలు రేపు మాట్లాడుకోవొచ్చు. ముందు లారీని స్టేషనుకు తోలుకు పదండి' అన్నారు పోలీసులు.

లారీ వెనుక్కు మళ్ళింది.

మూడోరోజున రంగనాయకులకు మూడు మాసాల కఠిన శిక్ష విధించాడు న్యాయమూర్తి. లారీ వడ్లతో ప్రభుత్వం స్వాధీన పరుచుకొంది. వెంకట్రత్నం లాంటి సాధువు దొంగవ్యాపారం చేస్తాడని గానీ, చేయిస్తాడనిగానీ ఎవ్వరూ నమ్మలేదు. ఆయన చేసిన ప్రమాణాలు మరింతగా దీన్ని బలపరచినై. రంగనాయకులు తీర్పు వినగానే గొల్లుమన్నాడు. పాపం! ఎవరికోసమని ఈ శిక్ష రంగనాయకులు అనుభవించటం!